# మోహరుతువు



49

డా॥ వి. చంద్రశేఖరరావు



ఆడిటోరియం లోపల,

అనేక జ్ఞాపకాల బరువుతో మోహిని.

సాయంకాలం ఆరు గంటలు దాటింది. ఆడిటోరియం కిటికీల పైన పిచ్చుకలు, పావురాళ్ళు కొత్తపాటలు పాడే ప్రయత్నంలో ఉన్నాయి. కిటికీలోంచి సాయంకాలపు ఆకాశం కెంజాయ రంగు ముఖంతో తొంగి చూస్తుంది.

ఆడిటోరియంలో ప్రదర్శన మొదలౌతుంది. మోహిని ముఖం చుట్టూ నిశ్శబ్దపు తెర.

నిశ్శబ్దానికి ఆవల, ఆమె గురించిన చర్చ, నినాదాలు, కేకలు. ఆడిటోరియం బయట మరో ప్రదర్శన జరుగుతుంది. ఆడిటోరియంలో ఉన్న ప్రేక్షకులు ఉద్వేగావస్థలో ఉన్నారు. వాళ్ళకోసం రెండు ప్రదర్శనలు, బయట ప్రదర్శన ముగియాలని వాళ్లకు లేదు. అందులో సెన్సేషన్, థ్రిల్.

బయట, చెక్కబల్లలపై కూర్చున్నవాళ్ళు, నినాదాలు చేస్తూ (మోహిని డౌన్‌డౌన్, ఫాసిస్టు మోహిని నశించాలి, మోహిని రాజీనామా చేయాలి, వగైరా), కేకలు వేస్తూ, వాళ్ళు సంచలనాత్మకమైన నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళు తెల్లగా మిలమిలలాడుతున్నారు, దేవతల సంతానంలా (పూర్తి మేకప్‌తో వచ్చారు). మీడియా అంతా అక్కడే ఉంది. (సంగీత నాటక) అకాడమీ ఛైర్మన్ పదవికి మోహిని రాజీనామా చెయ్యాలని వాళ్ళ డిమాండ్. బెంచీలపై కూర్చున్న కళాకారులు ఒక్కొక్కళ్ళు ఒక్కో సంఘటన (మోహిని నిర్ణయాలకు వ్యతిరేకంగా) చెబుతున్నారు. వేరు వేరు నాటకాలలోని దృశ్యాలన్నీ ఒకదానితో ఒకటి మిక్స్ అయినట్లుగా అక్కడ వందలాది సంభాషణలు.

బెంచీల కవతల పాతికమంది యువకళాకారులు (శిష్యులు, అనుచరులు వగైరా) మోహిని జీవితాన్ని వీధినాటకంగా ప్రదర్శిస్తు న్నారు. వాళ్ళకు కాస్త ఎడంగా ఇబ్రహీం నిలబడి ఉన్నాడు. మాటి మాటికీ తన చేతులవైపు చూసుకుంటున్నాడు. ఆకాశంవైపు, అస్త మిస్తున్న సూర్యుడి వైపు, కెంజాయరంగు సాయంకాలం వైపు చూస్తున్నాడు. 'ఇక మోహిని కథ ముగింపుకు వచ్చింది' అని రెండు మూడుసార్లు గొణుక్కున్నాడు.

* * *

ఆడిటోరియం లోపల.

తాత్వికతను పులుముకొన్న ముఖాలు. కృత్రిమమైన గాంభీర్యం, కాస్త వెలుగు, కాస్త చీకటి మిళితమైన కొయ్య బొమ్మలు.

స్టేజి పై డాన్స్ బాలే. కొరియన్ అమ్మాయిలు రంగుల బొమ్మల్లా సాగుతూ, కదిలే శరీరాల్లోంచి, మార్మికమైన అలజడిని సృష్టిస్తున్నారు. ప్రేక్షకుల ముఖాలు మాత్రం, ఒక్కలాగే వేలాడదీసిన చర్మపు బొమ్మల్లా, బొమ్మలు కదిలినట్లే మధ్య మధ్యలో చప్పట్లు.

ముందు వరసలో కూర్చుంది మోహిని. ఆవేల్టి ప్రదర్శనకు ముఖ్య అతిథి. నాట్యంలో లీనమైపోవాలని ప్రయత్నిస్తుంది. కానీ ఏదో నిస్సత్తువ. లోపలి ప్రపంచాలు కూలిపోతున్నట్లు. 'బ్లాక్ అవుట్, బ్లాక్ అవుట్, బ్లాక్ అవుట్' అంటూ గొణుక్కుంది. ఎర్రటి తెర స్టేజీపై ఎగురుతుంది. అలలాగ అన్నివైపులకు పాకుతూ, దుఃఖభరితమైన గీతం. చాలా వయొలెన్లు, పియానోలు కలిసి రోదిస్తున్నట్లుగా, లోపలి భాగాల్ని చీల్చుతున్నట్లు, దేవతల కవాతులా డాన్సర్లు, వలయాలు వలయాలుగా ఏర్పడి, విడిపోయి, మధ్యలోంచి ఒక రూపం, క్రమం గా స్టేజినంతా ఆక్రమిస్తూ హఠాత్తుగా వెలుగు, ధ్వని రెండూ ఎక్కువ యినాయి. స్టేజి నిండా భగ్గుమన్న బంగారు రంగు. ఆ రంగులోంచి తథాగతుడి రూపం.





మోహిని కళ్ళు రెండూ మూసుకొని, చెవుల్లోకి ఏ ధ్వనీ ప్రవే శించనీయకుండా క్షణంసేపు ఆ ప్రదేశంలోంచి విడిపోయి, తన్ను తాను అపరిచితంగా మార్చుకొని, ఎవరికీ చెందనట్లు కూర్చుంది. బయట కోలాహలం (అరుపులు, నినాదాలు) లోపలికి తోసుకొస్తు న్నాయి. గాఢంగా నిట్టూర్చి, రెండు చేతుల్ని తలపై పెట్టుకొని శప్త యోగినిలా కూర్చుంది.

స్టేజిపై మరో డాన్సు మొదలైంది. తెల్లటి ముఖాలు. ముఖాల నిండా వెలిగే నవ్వులు. ఏడు రంగులుగా చీలుతూ, మళ్ళీ కలుస్తూ. నేపథ్య సంగీతంలో తాత్వికత నశించి, భౌతికస్థాయిలోకి వచ్చింది. క్లారినెట్, డ్రమ్స్, మధ్యలో ఫ్లూటు (కొయోటో). ఆడిటోరియంలో వేలాడదీయబడ్డ చెక్క ముఖాలన్నీ ఆ సంగీత ప్రవాహానికి ఊగిపోతు న్నాయి. ఆడిటోరియంలోంచి బయటకువచ్చింది మోహిని. బయట కోలాహలంగా ఉంది. అరుపులు, కేకలు. మోహినిని చూస్తూనే మళ్ళీ పెద్దగా నినాదాలు. బల్లలపై కూర్చున్న వాళ్ళందరూ, కళా ప్రపంచంలో అత్యంత ప్రముఖులు, గాయకులు, నాట్య ప్రముఖులు. థియేటర్ ప్రయోక్తలు, కవులు. ఆసక్తిగా అటువైపుకు చూస్తూ నిలబడింది.

హఠాత్తుగా మోహినికి కళ్ళు తిరిగినట్లుగా తోచింది. మనుషు లందరూ నల్లగా కనపడుతున్నారు. తను పూర్తిగా అదృశ్యం అయి పోతున్నట్లు, ఎవరో మోహినిని బలంగా ఒడిసిపట్టుకున్నారు. అంతా చీకటి చీకటిగా. 'బ్లాక్ అవుట్, బ్లాక్ అవుట్' అంటూ గొణుక్కుంది. నలుగురైదు గురు ఆమె చుట్టూ మూగారు. ఫరవాలేదంటూ సైగచేసి లోపలికి నడిచింది.

మధ్యలో 'ఫోన్' రింగ్ అయ్యింది. తీసి చూస్తే 'N' దగ్గర నుంచి. మాట్లాడాలనిపించలేదు. గట్టిగా నిట్టూర్చి ఫోన్ ఆపేసింది. మరో నాలుగుసార్లు మోగింది. 'N' దగ్గర నుంచే. అధికారం దూర మయిన రోజులివి. అశక్తంగా, కోపంగా ఉన్నాడు 'N'.

నాట్యం ముగింపుకొచ్చింది. అద్భుతమైన రాగాలు. తాంత్రిక శక్తులేవో ఉన్నట్లుగా. బుద్ధుడి సౌందర్యాన్ని వివరిస్తూ. భగవంతుడికి కూడా సౌందర్య భాష అవసరమా అనుకుంది. భక్తి, సెక్స్, అధికారం అన్నింటిలో ఈ సౌందర్య భాషే వినియోగం అవుతుంది, అనుకొని నవ్వుకొంది. ఆడిటోరియంలో చప్పట్లు (చెక్కబొమ్మలు టపాటపా కొట్టుకుంటున్నట్లు). తరువాతి నాట్యం మొదలుకావడానికి ముందుగా, టీమ్ మేనేజరు, నాట్యంలో చేసిన ప్రయోగాల్ని వివరిస్తున్నాడు. అకాడెమీ తరఫున నాట్యబృందానికి అవార్డులివ్వమని, ఏదైనా మాట్లాడమని మోహినిని ఆహ్వానించారు. ‘‘శ్రీమతి మోహిని సుందరం, కలైమామణి, నాట్యసుధ బిరుదులు. దాదాపు పన్నెండు వందల ప్రదర్శనలు. కెనడా, అమెరికా జపాన్‌లలో ప్రదర్శనలు’’. మోహిని బయోడేటా చదువుతున్నారు. లేచి నిలబడింది. చీకటి చీకటిగా వుంది. కళ్ళు తిరుగుతున్నట్లుగా. ఎక్కడో ఒక మహా నగరం కూలిపో తున్నట్లుగా. కూలిపోతున్న శబ్దం గాలితెరలపై నుంచి ప్రయాణించి, ఆడిటోరియంని చుట్టుముట్టి నట్లుగా. పొడవాటి సొరంగం. ఎప్పటికీ బయటి ద్వారం కనబడదు. సొరంగంలో ఆక్సిజన్ అయిపోయి, ఊపిరాడనితనం. బ్లాక్ అవుట్, బ్లాక్ అవుట్ అంటూ గొణుక్కుంది. మైకు ముందు మోహిని. ‘‘మిత్రులారా, స్టేజిపైకి వస్తుండగా, నేనొక కలకన్నాను. కలలో నేను అదృశ్యం అవటాన్ని చూశాను. హఠాత్తుగా నేను అస్థిపంజరంగా మారిపోటాన్ని చూశాను’’. నేనింకా కలగంటూనే ఉన్నాను నా మరణాన్ని’’ హాలులో పెద్దగా కలకలం. ఆమె పి.ఎ. ఆమె పక్కకు వచ్చి చెవిలో ఏదో గొణిగాడు. టైపు చేసిన ఉపన్యాసాన్ని ఆమెకు ఇవ్వబోయాడు. అతన్ని పట్టించుకోకుండా ‘‘కలను తరిమి వెయ్యాలని ప్రయత్నిస్తున్నాను. సాధ్యం కావటం లేదు. కలను, కలలోని మరణాన్ని నేను మోస్తూనే ఉన్నాను’’ క్షణం సేపు ఆపి మోహిని కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, పి.ఎ. ఆమెను అనున





యించడానికి, పక్కకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు. "మిత్రు లారా, బహుశా ఇది నా చివరి మీటింగ్ కావచ్చు. అకాడెమీ ఛైర్మన్‌గా రాజీనామా చెయ్యమని బయట గొడవ జరుగుతుంది. ప్రభుత్వం నన్ను రిజైన్ చెయ్యమని అడగవచ్చు. ప్రపంచంతో నా చివరి సంభాషణ ఇదే కావచ్చు. అందుకే నా గురించిన నాలుగు విషయాలు మీతో మాట్లాడాలనిపిస్తుంది. నా కథ వినండి. ముఖ్యంగా కొత్తతరం కళాకారులు శ్రద్ధగా వినాల్సిన కథ ఇది."

* * *

అప్పుడు ఇరవైయేళ్ళు. అన్నీ చేతుల్లోకి యిమిడినట్లే యిమిడి జారిపోయే వయసు. ప్రపంచం నా విహార ప్రదేశంలా తోచేది.

జ్ఞాపకాలన్నీ అట్లాగే ఉన్నాయి. పరదాలన్నిటికీ నిప్పు అంటుకున్నా దృశ్యాలట్లాగే నిల్చి ఉన్నాయి.

మా నాయనమ్మ గదంటే నాకెంతో యిష్టం. గదినిండా గజ్జెల చప్పుడు. డెబ్భై ఏళ్ళ వయసులోనూ ఎంతో సమ్మోహనంగా నాట్యం చేసేది! నా తొలి గురువు తనే. "శరీరం కాదు, ఆత్మ నర్తించాలి. లోపలి నుంచో జ్వాల బయటకు రావాలి" అంటూ వివరించేది.

నేను అందంగా ఉంటానని అనేవాళ్ళు. నేనూ అట్లాగే అనుకునేదాన్ని. వందలాది ఫొటోలు నా గదినిండా. తెల్లని శరీరం, గులాబీ రంగు చెక్కిళ్ళు (నిండుగా), వెడల్పాటి కళ్ళు, పొడవాటి జడ (నొక్కుల నొక్కుల జుట్టు) నా శరీరం గురించి, నా నాట్యం గురించి నాకెంతో గర్వంగా ఉండేది.

సుందరాన్ని చూసిం తరువాత, మళ్ళీ కొత్తగా పుట్టటం మొదలుపెట్టాను. సన్నటి దేహం, తీక్షణమైన కళ్ళు, అతని నాట్యం చూసిన తరువాత సమ్మోహితం చెయ్యటం అంటే ఏమిటో అర్థమైంది. మనషుల్లా కాకుండా దేవతల్లాగా నాట్యం చేసేవాడు. వేగంగా

కదిలే శరీరం. అతని శరీరంలోంచి శక్తి ఏదో బయటకు చిప్పిలి, స్టేజి అంతా శక్తి వలయంలా మారిపోతుంది. అయస్కాంతంలా కట్టి పడేస్తుంది.

నేను మళ్ళీ మొదలుపెట్టాను. కొత్తగా నోట్‌బుక్‌తో సహా, మళ్ళీ పాఠాలు నేర్చుకుంటున్నట్లు. కొత్త ప్రయోగం. శరీరాన్ని అవయవంలా కాకుండా శక్తి మండలంలా భావించటం. కొత్త తలుపులు తెరిచాను. సుందరాన్ని అధ్యయనం చెయ్యటం మొదలుపెట్టాను. సుందరాన్ని చూస్తున్నప్పుడు వింత భావన. అతనిలోని శక్తినంతా దొంగిలించి వెయ్యాలని.

కొత్త సూర్యోదయాలు, సుదీర్ఘ ప్రయాణాలు. మద్రాసులో సుందరంతోపాటు ఇచ్చిన తొలి ప్రదర్శన, (డాన్స్ స్కూల్ తరపున). బాలెడ్, సుందరమే రూపకల్పన చేశాడు. కణ్ణగి కథ. నాట్యాన్ని పోయమ్‌లాగా చెప్పటం సుందరానికి తెలుసు. శరీరాన్ని దాటి మరో డైమన్షన్‌ను సృష్టించాడు. నది పొంగి నగరాన్ని ధ్వంసం చెయ్యటం ప్రేక్షకులు అనుభవించారు. ప్రోగ్రామ్ అయిపోయినాక కూడా ఎగిసి వస్తున్న నీళ్ళ ప్రవాహాన్ని నేను చూశాను.

కాలం ఎగిరిపోవటాన్ని నేను గమనించాను. సుందరం ఒక్కడే, ఈ ప్రపంచంలో అనిపించటం మొదలుపెట్టింది. సుందరం అనే ఆలోచన లేకపోతే నేను శక్తిహీనంగా మారిపోవటం గమనించాను.

చిన్న చిన్న పట్టణాలు, హోటళ్ళు, కిక్కిరిసిన ఆలయాలు, పచ్చని భూములు. విశాలమైన లాండ్‌స్కేప్‌పై ప్రయాణాలు. మీనాక్షి అమ్మవారి గుడిలో సుందరాన్ని పెళ్ళి చేసుకున్నాను. (సుందరం బ్రాహ్మల కుర్రాడు కాదు.)

మహానదులు, నీటి కాలువలు, పంటచేలు అటు స్టేజిపై పౌరాణిక భూములు, యుద్ధం, విధ్వంసం, భగవంతుడు. ప్రదర్శన





ముగిశాక వెచ్చని శరీర తీరాలు. సుందరం, శృంగార నాయకుడై దేవతల ఆట అనేవాడు.

రెండు గదుల అపార్ట్‌మెంట్, కుర్చీలు, మంచము తప్ప ఫర్నీచర్ లేని గది. అన్నిటికీ వెతుక్కోవటం. జీవితం అందమైన బాలెడ్ కాదని మెల్లగా అర్థం అవటం మొదలుపెట్టింది. అప్పట్లో ప్రదర్శనకు ఐదువేలు కూడా ఇచ్చేవాళ్ళు కాదు. ట్రూప్‌లో మిగిలిన అమ్మాయిలు, మేకప్ ఆర్టిస్టు లకు, నట్టువాంగం బృందానికి ఇవ్వగా ఐదొందలు కూడా మిగిలేవికావు. పెళ్ళి చేసుకోవటం (పెద్దలను కాదని), విడిగా జీవించటం ఏమంత ఉద్వేగభరితమైన విషయం కాదని అర్థం కావటం మొదలుపెట్టింది. జీవితం ఇప్పుడు పొయిట్రీలాగా కాకుండా, అచ్చమైన ఆర్థికశాస్త్రంలా కనబడటం మొదలుపెట్టింది. సుందరం పదాల పొదుపును నమ్మేవాడు. ఏదీ స్పష్టంగా వ్యక్తం చెయ్యడు (ఆఖరికి ప్రేమను కూడా). నిజానికి సుందరం అనే కలను నేనే వెంటాడి, రెండు చేతుల్లో పొదువుకొని, నా శరీరంలో దాచు కున్నట్లు, అతను మాత్రం ఏ కదలికా లేని స్వప్నవిశేషంలా ఉండి పోయేవాడు.

వెంకటేశ్వర కల్యాణం, భామాకలాపం (సరేసరి), రుక్మిణీ పరిణయం, ఈ పౌరాణికాల మధ్య సుందరం కొత్త ప్రయోగం చేశాడు. రిచర్డ్ బాక్ నవల 'జొనాథన్ లివింగ్‌స్టన్ సీగల్' నవలను డాన్స్ బాలేగా మార్చాడు. అందులో జొనాథన్‌గా సుందరం చేశాడు. మంచి రివ్యూలు వచ్చాయి. కానీ ప్రదర్శన కోసం నగల్ని అమ్మివేయాల్సి వచ్చింది. ఒక ట్రూప్‌ని ఏర్పాటు చేసుకోవాలని, డాన్స్ స్కూల్ పెట్టుకో వాలనే సుందరం కలలు నెరవేరలేదు.

నెలలో సగం రోజులు ఇంటిలోనే ఉండేవాడు సుందరం. తిరుగుతున్న ఫాన్, వెలుగుతున్న లైటులాగే అచేతనంగా పడి ఉండేవాడు. అచేతనమైన మూర్తిలో, అటూ ఇటూ వందలాదిగా

విస్ఫోటనమవుతున్న భంగిమలు తోచేవి. ఇంటిలో పెద్దగా సంభాషణ లుండేవి కావు. నాలుగైదు వాక్యాలో, పదాలో రోజు మొత్తంలో. అచేతనంలోంచి హఠాత్తుగా వెచ్చని జ్వాల రేగేది. వివస్త్రంగా ఉన్న శరీరపు రహదారిపై విధ్వంసనర్తనం చేసేవాడు సుందరం. ఆ శక్తికి నేను ధ్వంసమై, నాశనమై, అస్తిత్వ శూన్యంగా అవుతానేమో అనిపించేది. వైలెంట్ ఆర్గాజమ్. ఒక మనిషితో కాక వేలాది మనుషులతో సంగమిస్తున్న అనుభూతి.

రెండు గదుల అపార్ట్‌మెంట్‌లో ఏ వసతులు లేకుండా (ఏ.సి., ఫ్రిజ్ వగైరా), నిత్యం ఆకులు రాలుతున్నట్లుగా, సన్నటి వర్షపు తెమ్మెర కదులుతూ, ఆత్మ ఎక్కడెక్కడో తిరిగి, మధురమైన సంగతులన్నిటినీ సేకరించి తెచ్చినట్లుగా, హఠాత్తుగా, నా శరీరంలోంచి విడిపోయి, సుందరం మహానర్తనంగా మారేవాడు. ఆ నర్తన వేళ, అతను ఒట్టి శరీరం కాదు. జ్వాల, వాయువు, మహావాంఛ, దుఃఖం, మరణం, కొత్తగా పుట్టటం.

ఇల్లు సర్దుకోవటం, వంట చేసుకోవటం, చిన్న పనులేగాని, గొప్ప ఉద్వేగాన్ని కలిగించేవి. ఇంటి పనులన్నీ ఇద్దరం కలిసి చేసేవాళ్ళం. కొత్త బాలే గురించి గంటల తరబడి మాట్లాడుకునేవాళ్ళం. రాత్రి కోసం ఎదురుచూస్తూ ఉండేవాళ్ళం. చెమట, శ్వాస, శరీరాలు అదృశ్యమై, ఆత్మలు రాత్రి పొడవునా వాయులీనం చెయ్యటం, అవి అద్భుతమైన రోజులు.

సుందరం సాయంకాలం నాలుగు గంటలకు డాన్స్ క్లాస్‌లకు వెళ్ళేవాడు. (పదిమంది పిల్లలు) వచ్చేటప్పుడు గాయపడ్డ పక్షిలాగా వచ్చేవాడు. ఏదో అసంతృప్తి.

కుప్పలుకుప్పలుగా డాన్స్ అకాడమీలు ఉండేవి. కొన్ని అకాడమీలే బాలేని ప్రదర్శించేవి. వాటిల్లో గ్రూప్ డాన్సర్‌గా వెళ్ళేదాన్ని. నెలకింతని జీతం. కొత్త నాట్యం ఏదైనా స్ఫురించినపుడు, సుందరం చాలా





ఉద్వేగంగా ఉండేవాడు. వారాల తరబడి రీసెర్చి చేసేవాడు. ఇద్దరం కలసి ఒక నృత్య నాటకాన్ని ఆవిష్కరించేవాళ్ళం. ఏ మారుమూల దేవాలయంలోనో (స్కంధగిరి) ఆ బాలేని ఆడేవాళ్ళం. పదిమందో, ఇరవైమందో అనాసక్త ప్రేక్షకులు. ప్రదర్శనకు ఐదువందలు, ప్రసాదం. అయినా అదో అద్భుతమైన మోహయాత్రలా అనిపించేది.

సుందరం మాత్రం ఎందుకిట్లా జీవించటం అనేవాడు. నేను నవ్వేదాన్ని. సుందరం లోపల దగ్ధమవుతున్న మనిషిని నేను పసి గట్టలేదు.

వినాయక చవితి పండుగలలో నాలుగైదు ప్రదర్శనలు. చెక్క బల్లలు, దానిపై కార్పెట్టు, రోమియోలు, పోకిరీలు, బొత్తిగా ఆసక్తి లేనివాళ్ళు, గాయపడ్డ హంసలా ఇంటికి వచ్చేవాడు సుందరం. రోజుల తరబడి గాయాన్ని మోసుకొని తిరిగేవాడు.

''ఎక్కువ ఆలోచించవద్దు. సొసైటీకి జబ్బు చేసింది'' అనే దాన్ని. ''పెళ్ళికి ముందు నాకెందుకు వివరించలేదు. ఇక రోజులన్నీ ఇట్లాగేనా'' అని దిగులుపడేవాడు.

''ఇదంతా జోక్‌లా ఉంది. ఎందుకీ డాన్స్‌లు, ఎంత టైము వృధా చేసుకున్నాము,'' అనేవాడు.

''ఇంతదూరం ప్రయాణించాక ఈ రోడ్డును వదిలేద్దామంటే ఎలా?'' అంటే, ''జీవితంతో మనం చేసిన ఖరీదైన ప్రయోగం,'' అని దిగులు పడేవాడు.

సరిగ్గా నాలుగు నెలల తరువాత జీవితంతో నిజంగానే ప్రమాద కరమైన ప్రయోగాన్ని మొదలుపెట్టాడు.

'N' అనే రాజకీయ నాయకుడి ఆఫీసులోకి పాదం మోపాడు. 'N' ఆధునిక గిరీశం. శకారుడు. రాజకీయాల్ని వృత్తివిద్య స్థాయికి తెచ్చినవాడు. అందమైన పోస్ట్ మోడరన్ కబుర్లు చెప్పేవాడు. గారడీ వాడు మోళీ కట్టినట్లు మీడియాను లోబరుచుకున్నాడు. కొత్త

ఎకానమీ, గ్లోబలైజేషన్ మంత్రాలు పఠించేవాడు. అధికారం అతని అంతిమ స్వప్నం. అందుకోసం ఏ వనరు ఉపయోగపడ్డా, అతను వదులుకోడు. కులం, ప్రాంతం, న్యూస్ పేపరు, టీవీ ఛానల్, కళ, సినిమా ఏదైనా సరే, సుందరంతో సంభాషణ కులంతో మొదలు పెట్టాడు. "మన కులంలో ఇంతటి మహా కళాకారులెక్కడ?" ఆశ్చర్య పోయేడు. సుందరానికి కులం తోకను జోడించి అందరికీ పరిచయం చేశాడు. పార్టీ వార్షిక సమావేశాల్లో సుందరం బాలే ప్రదర్శితమైంది. సుందరం 'N' పార్టీలో కల్చరల్ ఎడ్వైజరుగా కొత్త జీవితం మొదలు పెట్టాడు.

కసి, పశ్చాత్తాపం, ప్రేమ, ద్వేషం, ఆరాధన, ఇంకా ఏవేవో అర్థం కాని భావనలన్నీ సుందరంలో కనపడేవి. "పొరపాటు చేస్తున్నా వేమో," అన్నాను.

సుందరం వినిపించుకోలేదు. జ్వర తీవ్రతలో ఉన్నవాడిలా మారిపోయాడు. వేషం మారింది. భాష మారింది. 'N'కి కుడిభుజంలా మారాడు. పొలిటికల్ బాలేలు తయారుచెయ్యటం మొదలుపెట్టాడు. 'N' రాజకీయ సిద్ధాంతాలకు కాన్వాస్‌గా మారాడు.

భగవంతుడిలా నాట్యం చెయ్యగల సుందరం థర్డ్ రేట్ సెటైరికల్ థియేటర్‌గా మారిపోయాడు. నాట్యంలేదు. అంతా సంభాషణే. అద్వైతం లేదు (ఆర్తి) ఒట్టి ఎక్రోబిక్స్. ఇరవైయేళ్ళ పిల్లలు, కాళ్ళు చేతులు ఊపడమే నాట్యం అనుకునేవాళ్ళు. వాళ్ళతో ప్రదర్శన యిచ్చేవాడు. దానికి 'సింథసిస్' అని పేరు పెట్టాడు. (ఈ ప్రదర్శనల్లో సుందరం మాత్రం నాట్యం చేసేవాడు కాదు).

అర్ధరాత్రులు నేను నిద్రపోయాక, నిశ్శబ్దంగా లేచి, రాత్రి పొడవునా నాట్యం చేసేవాడు. (ఇదొక రకం దుఃఖ పడటం).

అపార్ట్‌మెంట్ మారాము. నల్లకుంట నుంచి బంజారాహిల్స్‌కి. కొత్త పరిచయాలు, రాత్రి పార్టీలు. కులాలతో, స్టేటస్‌లతో పలక రింపులు.





ప్రియమైనదేదో క్రమంగా దూరమవుతున్నట్లు, పచ్చిక నిండిన కలల తోట, నగరపు రద్దీలో తప్పిపోయినట్లుగా ఉండేది.

సుందరం పక్కన ఇప్పుడు కులం పేరు చేరింది. రెండు మూడు బిరుదులు కూడా. నాట్య ప్రవీణ, కలైమామణి (మద్రాసు వాళ్ళది) వగైరా.

ఈ ప్రయాణంలో ఏమేమి పోగొట్టుకుంటున్నామో సుందరానికి వివరించినా, వినిపించుకునే మూడ్ లేదు. ఒంటరి దుఃఖం నాది. ఆకు పచ్చని నా ప్రేమలేఖ, రోడ్డు పక్కన ఎక్కడో జారిపోయింది. నా ఆత్మ పిట్టలా మారి, నా నగ్నదేహంపై షికార్లు చేసే ముచ్చట ఇప్పుడెక్కడ? రాత్రివేళలో ఆకాశంలో ఎర్రటి మంటలు కన్పిస్తున్నాయి.

ఢిల్లీ తెలుగు సంఘంలో నాట్య ప్రదర్శన సుందరం జీవితంలో ముఖ్య ఘట్టం. 'N' దీన్ని సుందరానికిచ్చే 'కానుక'గా ఏర్పాటు చేశాడు. తన పలుకుబడితో రాజకీయ ప్రముఖుల్ని (M.P., మంత్రులు), కళా ప్రముఖుల్ని (మల్లిక, సోనాల్, రాజారెడ్డి వగైరా) ఆహ్వానించాడు. స్టేజిపై సుందరం జ్వాలలా వెలిగేడు. శరీరాన్ని ధ్వంసం చేసి, తుఫానులా, పెను మంటలా నర్తించేడు. (సుందరంలో కళాకారుడు ఇంకా చచ్చిపోలేదు) నాలుగైదు వార్తాపత్రికల్లో సుందరం గురించిన వ్యాసాలు. రాత్రికి రాత్రి సుందరం ప్రముఖ నాట్యాచార్యుడు అయ్యాడు.

ప్రదర్శన జరిగిన రాత్రి, 'N', సుందరం గౌరవార్థం పార్టీ ఇచ్చాడు. వైన్, ఖరీదైన సెంట్, రాత్రి పన్నెండుదాకా సాగింది. గదిలో, సుందరం కోసం (అద్భుతమైన అతని నాట్యం చూసిన పరవశంలో) రంగు పిట్టలా కువకువమంటూ ఎదురుచూస్తూనే ఉన్నాను. ఒంటి గంటకు సుందరం వచ్చాడు. ఆర్గాజమ్‌లేని సెక్స్ అంటే అర్థమయింది మొదటిసారిగా.

మరో రెండేళ్ళలో సుందరం కథ పూర్తిగా మారిపోయింది. 'N' ముఖ్యమంత్రి అయ్యాడు. సుందరం సంగీత నాటక అకాడమీకి ఛైర్మన్, ప్రభుత్వానికి కల్చరల్ ఎడ్వైజరు అయ్యాడు. క్యాబినెట్ మంత్రి హోదా.

ఇద్దరం కలిసి పది నిముషాలు మాట్లాడుకోవటం అరుదైంది. మా యిద్దరికే పరిమితమైన 'భాష' అదృశ్యం అయిపోయింది. విశాల మైన గ్రానైటు భవనం. రాజదర్బారులాంటి ఆఫీసు. అధికారం లాంటి, అందం లాంటి, మత్తులాంటి, మోహంలాంటి జీవితం. కారు, పి.ఎ., సెక్యూరిటీ. గొప్పగొప్ప కళాకారులు అతనికోసం ఎదురుచూడటం. సుందరం ఆహార్యం మారింది. లోపలనుంచి ఒక కొత్త వ్యక్తి సమస్తాన్ని చీల్చుకొని బయటకు వస్తున్నాడు. కొత్త అవతారం యిది.

'వినిర్మాణ దేహాలు' పేరుతో డాన్స్‌పై ఒక సెమినార్ జరిగింది హైదరాబాద్‌లో. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నాట్యకళాకారుల్ని ఆహ్వానించారు. విలియమ్ ఫోర్‌సైత్ (లండన్), ఎలవీన సెల్వాని (పారిస్) మారిస్‌బిజార్డ్ (పారిస్), మల్లికా సారాబాయ్, సోనాల్ మాన్ సింగ్, చంద్ర లేఖ, మద్రాసు కళాక్షేత్రవాళ్ళు. (భారతీయ) నాట్య సాంప్రదాయం రెండుగా చీలిన సందర్భం అది. సుందరం కొత్త ప్రవక్తగా అవతారం ఎత్తాడు. అభినయాలు, ముద్రలు వద్దు. భరతుడి సాంప్రదాయాలూ వద్దు. పౌరాణిక గాథలు చెప్పటం మానేద్దాం" అంటూ ప్రకటించేడు. "శరీరాన్ని ఒక కొత్త రూపంలోకి ప్రవేశపెడదాం. ఎయిరోబిక్స్, అసంబద్ధమైన కదలికలు కలిసిన రూపం. ఐరిష్‌జిగ్, కాలిస్థిటిక్స్, యోగ, నిశ్శబ్దం ఇవిచాలు. దీన్ని మ్యుటేషన్స్ అందాము," అన్నాడు.

ఈ కొత్త నాట్యాన్ని ప్రాక్టీస్ చేస్తూ హతాశురాలనైనాను. ఏదో తెలియని దృశ్యతీరాల్లో చిక్కుబడిన యాత్రికురాల్లా మారాను. సాంప్ర దాయబద్ధమైన అలరిప్పు లేదు, వర్ణంలేదు. సరికొత్త రూపం. అపరి చితమైన శబ్దాలు. సుందరం చేసిన ఈ కొత్త నాట్య రూపంపై చాలా





చర్చ జరిగింది. నాట్యం ఆత్మ దర్శనం దశను దాటి మోహ దర్శనం స్థాయికి వచ్చింది. ప్రేక్షకుల్లో ఒక సంభ్రమం, భయం, జుగుప్స (ఫాసినేషన్ అంటాడు సుందరం). నాట్యం చివరిలో లింగం, యోని ముద్రలతో, దాదాపు పోర్నోగ్రఫీ స్థాయికి వెళ్ళింది.

కళాక్షేత్రవాళ్ళు, ఈ నాట్యాన్ని తీవ్రంగా నిరసించారు. ఇది భగవంతునికి వ్యతిరేకం (ఏంటీ గాడ్ ఆఫ్ డాన్స్‌గా సుందరాన్ని నిందించారు). అయితే బయటి దేశాల నుంచి వచ్చినవాళ్ళు దీన్ని ఎంతో అభినందించారు. విలియం ఫోర్‌సేత్ దీన్ని క్లాసిక్ ఫాంటసీగా మెచ్చుకున్నాడు.

'N' ఆ సెమినార్‌కి ముఖ్య అతిథి (ముఖ్యమంత్రి హోదాలో) నాట్యాన్ని గ్లోబలైజ్ చేయ్యాలని, ముఖ్యంగా విదేశీయులకు (పర్యాటకులకు) నచ్చేలా మార్చాలని. పురాణ కథలు తగ్గించి, నాట్యంలో స్పీడు పెరగాలని, నాట్యం వినియోగ వస్తువుగా మారి విదేశీమారకం తెచ్చి పెట్టా లని వివరించేడు. టూరిస్టు డిపార్ట్‌మెంటును, లలితకళా అకాడమీతో అనుసంధానం చేసి, నాట్యోత్సవాలను ఏర్పాటుచెయ్యాలని ఆదేశించాడు.

దృశ్యం మారింది. అకాడమీ షాపింగ్‌మాల్ అయ్యింది. కాస్త నాట్యం, కాస్త వైన్, కావలసినంత తిండి. కొత్త ఆడిటోరియాలు నిర్మాణం అయ్యాయి. కొత్త కళారూపం గురించి విరివిగా ప్రచారం జరిగింది. నాట్యం (లేదా ఏ కళారూపమైనా), వస్తురూపం అని, ప్రయోగం, రూప విచ్ఛేదం దానికి అవసరమని, అది ఒక ఎంటర్ ప్రైజ్‌గా మారి, వినిమయం జరగాలని.

వెస్ట్‌బెర్లిన్‌లో మొదటి విదేశీ ప్రదర్శన ఇచ్చాడు సుందరం. ముప్పయి ఆరుమందితో నాట్యం. (ఆంధ్రవంటలు, చేనేత వస్తువులు ఆర్థిక విధానాల గురించి ప్రచారం కూడా వెంటవెళ్ళేయి.) ఆ తరువాత

ఫ్రాంక్‌ఫర్ట్‌లో, పారిస్‌లో. సుందరం జైత్రయాత్ర అజేయంగా కొనసాగింది.

సుందరం ట్రూప్‌లో ఇప్పుడు నేను లేను. నేను లేకపోవటం గురించి సుందరం దిగులుపడలేదు. ఇంట్లో ఒంటరిగా, నిశ్శబ్దంగా, దిగులుగా కూర్చునేదాన్ని. గాజుబొమ్మలా (లేడీస్ అండ్ జంటిల్‌మెన్ మీ భాషలో దీన్ని డిప్రెషన్ అంటారు) ఆత్మ ముక్కలు ముక్కలుగా చిధ్రమై ఏ ముక్కలో నా అసలు ముఖం ఉందో తెలుసుకోలేనితనం. ఒకరోజు సుందరాన్ని అడిగాను" మళ్ళీ మునుపటిరోజులు మనకు తిరిగివస్తాయా" అని.

"ఎవరి రోజులు నీవా, నావా" అన్నాడు.

"మనిద్దరివి కావు. ఆత్మలవి. జీవనస్పర్శవి," అన్నాను వైన్ చప్పరిస్తూ.

"ప్రపంచాన్ని మన పాదాల దగ్గరకు తెచ్చి పడవేశాను. గమనించలేదా? వచ్చే నెల పారిస్‌లో, డాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నాను. కొరియోగ్రాఫర్లందరూ కలలు కనే ఉత్సవం. ఇది మన విజయం కాదా?" అన్నాడు నావైపు అసహనంగా చూస్తూ.

మా కథలోకి మూడో పాత్ర వచ్చిన సందర్భం అది. ఆ పాత్ర ఉనికిని, నేను గమనించేలోపలే ఎన్నో సంఘటనలు జరిగిపోయాయి.

ఆ పాత్ర పేరు ఇబ్రహీం. పాతబస్తీలో కూలిపోయిన మేడ. మేడ చుట్టూ చెత్త, మురికినీరు పేరుకుపోయి, అటువైపు నడవటం కూడా కష్టం అనిపించే ప్రదేశం. అది ఇబ్రహీం నివాసం.

ఇబ్రహీం... గొప్ప గాయకుడినని ఎప్పుడూ చెప్పేవాడు కాదు. క్లబ్బుల్లోనూ (ఇప్పుడు నెక్లెస్‌రోడ్డు పార్టీల్లో), హోటళ్ళలో పాటలు పాడేవాడు. 'N' అధికారంలోకి వచ్చినాక టూరిస్టుల హవా పెరిగి, ఇబ్రహీం పాటలు చూస్తుండగానే పాపులర్ అయ్యాయి. (రెండు ప్రైవేటు ఆల్బంలు కూడా వచ్చాయి). అతని పాటలు ఆత్మలోంచి

ఆత్మలోకి ప్రయాణిస్తాయి. కొద్దిగా ఉర్దూ గజల్స్ నుంచి జనపదాల (దరువులు) నుంచి కమ్యూనిస్టుల పాటల్లోంచి, తెలంగాణా పల్లెల నుంచి సేకరించుకొన్న బాణీలు. గవ్వలు, చెక్కబల్లలు, గాజుసీసాలు, స్పూన్ల నుంచి సంగీతాన్ని వినిపించేవాడు. మృదువైన కంఠస్వరం, నిర్మలమైన గొంతు. చార్మినార్ గల్లీలోంచి వచ్చే టీ ఘుమఘుమలు గుర్తుకొస్తాయి. ఖాకీపాంటు, టీషర్టు, కాన్వాస్ బూట్లు, అతి సామాన్యంగా ఉండే మనిషి. 'N'కి వ్యతిరేకంగా జరిగిన ఒక ఊరేగింపులో అతని పాటల్ని విన్నాను. ఆ పాటల్లోని నిసర్గ సౌందర్యానికి దిమ్మెర పోయాను. లాఠీచార్జ్, పోలీసు కాల్పులు (ఇబ్రహీంకి దెబ్బలు తగిలాయి).

అతని పాటల్లాగే అతను నివసించే గది ఒక అద్భుతం. ఏ అలంకారాలు, వస్తువులూ లేకున్నా మనసంత శుభ్రంగా ఉంది అతని గది. ఇబ్రహీం పాటలతోఒక ఫోక్ బ్యాలేను నెక్లెస్‌రోడ్డులో (వీధి నాటకం లాంటి) ఇవ్వటం గొప్ప అనుభూతి. అంతా మరణమే అనుకొన్న చోట ఆశ మళ్ళీ మొలకెత్తింది.

సుందరానికి ఇదో షాకు. తీవ్రమైన ప్రతిఘటన, గొడవలాంటివేమీ చెయ్యలేదు. "మన స్టేటస్ గురించి ఆలోచించవేమి?" అన్నాడు బరువుగా.

ఒక ఆశ్చర్యమైన కల. సుందరం, నేను, పక్కనే ఇబ్రహీం, ముగ్గురం ఒక యుద్ధంలోకి తోసివెయ్యబడ్డట్టు. నేనూ ఇబ్రహీం, సుందరానికి గతాన్ని గుర్తుచేసే ప్రయత్నంలో ఉన్నాము. సుందరం వందలాది మార్కెట్టు వస్తువులుగా మెటామార్ఫస్ చెందక ముందరి రోజుల్ని పాటలుగా వినిపిస్తున్నాము. యుద్ధరంగం నుంచి, బయటకు వచ్చేద్దాం అని సూచిస్తున్నాం. కల సుందరం మరణంతో ముగియటం ఇప్పటికీ నాకు ఆశ్చర్యం.

ఒక అర్ధరాత్రి ఇబ్రహీం ఇంటిపై దాడి జరిగింది. ఇబ్రహీంని రెండు చేతులు వెనక్కు కట్టి, అతి రాక్షసంగా అతని నాలుకను కోసి వేశారు.

ఇబ్రహీం నాలుకను కోసివెయ్యటం అనే బీభత్స దృశ్యం, ఒక మెటఫర్‌లా నన్ను వెంటాడుతుంది. చరిత్రలోని ఒక పురాతన యుగం నాటి సంఘటనలా నన్నింకా వెంటాడుతున్న దృశ్యం అది. మనుషులు తెగిన అవయవాలుగా మారిపోయే కాలం అది.

ఈ సంఘటన గురించి తెలియనట్లే ప్రవర్తించాడు సుందరం. కొత్త అతిథులు, బహుమతులు, పూలబొకేలు, పద్యాలతో (కవిత లతో) సత్కారం. ‘‘అధికారం, పెరుగుతన్న కీర్తి, చాలా సంస్థల్లో షేర్లు, సుందరం ది గ్రేట్. రాజభవనంలాంటి యింట్లో ఒక స్త్రీ, డిప్రెషన్‌లోకి వెళ్ళి (తెగి పోయిన నాలుకల దృశ్యం నిత్యం వెంటాడుతుండగా), ఇల్లంతా వందలాది, వేలాది తెగిన నాలుకల గుట్టలా, నాలుకల గుట్టను నిత్యం ఊడుస్తూ, సుందరం కన్పిస్తే (ఫోరా పశువా పో, వెళ్ళి పో అని) అరవాలనిపించి, అరవలేక, ఒక ఘనీభవించిన మౌనంలా మిగిలిపోయింది నేను. సుందరానికి నాకు మధ్యనున్న సున్నితమైన బంధం ఏదో తెగిపోయింది. విడిపోదామని ప్రపోజ్ చేశాను.

ఆగస్టు 17న సుందరం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాత్ రూమ్‌లో, మణికట్టు దగ్గర కోసుకొని. రక్తపు వరదలు. అంబులెన్స్, హాస్పిటల్, వందలాది ఫోన్‌కాల్స్, ప్రపంచవ్యాప్తంగా అతని గురించిన దిగులు. పన్నెండు గంటల తరువాత సుందరం చనిపోయాడు.

సుందరం సూసైడ్ నోట్‌లో- ‘‘కట్టుదిట్టాలు, ఆంక్షలు, 'N' నన్నో జైలులో బంధించాడు. నా ఆత్మను, కళను లాగేసుకున్నాడు. మోహిని క్రమంగా నాకు దూరమవుతుంది. నాకు ప్రియమైన నాట్యం ఇప్పుడు 'N'కు ప్రియురాలయింది. నా కలలన్నీ పూర్తిగా చచ్చిపో యాయి. రిజైన్ చెయ్యడానికి 'N' అంగీకరించలేదు. అతని సర్వ





రహస్యాలు నాకు తెలుసు కాబట్టి నా జీవితం మొత్తం అతని దగ్గరే గడపాలని శాసించాడు. రిజైన్ అంగీకరించకపోతే చచ్చిపోతానని 'N'ని బెదిరించాను. 'N' నవ్వేడు. పెద్దగా నవ్వేడు. అధికార భవనమంతా మార్మోగేలా నవ్వాడు. ఆ నవ్వు వేలాది శబ్దాలుగా ప్రతిఫలనం చెంది నన్ను వెంటాడుతూనే ఉంది. ఎక్కుపెట్టిన తుపాకీలా అన్నివైపుల నుండీ ఆ నవ్వే. "దానినుంచి విముక్తి లేదు- సుందరం" అని వుంది.

(ఈ నోట్ ప్రపంచానికి అందకుండా 'N' జాగ్రత్తపడ్డాడు).

ఏవైపు నుంచీ ఓదార్పు లేదు. సానుభూతి, సందేశాలు, మెమోరియల్స్ అయిపోయినాక ఇల్లంతా, ఎడారిలా మారిపోయింది. క్రమంగా ఒక్కొక్క దృశ్యం, అదృశ్యం అవుతూ, ఇల్లంతా ఖాళీగా మిగిలిపోయింది. సుందరం మరణం సహజ మరణంగా ధృవీకరించ బడింది. (మీడియా అంతా 'N' చేతిలో ఉంది). గొప్ప దుఃఖాన్ని నటించాడు 'N'. మారుతున్న సందర్భంలో, తూర్పు పడమరలను దగ్గరకు చేసిన ఘనత సుందరందే అన్ని ప్రస్తుతించాడు. ఒక ఆడిటో రియంకి సుందరం పేరు పెట్టడం జరిగింది. అకాడమీ కొత్త ఛైర్మన్‌గా నా పేరు ప్రకటించబడింది. తిరస్కరించే అవకాశం నాకివ్వలేదు. ఇద్దరు జర్నలిస్టులొచ్చి కెమెరాలు క్లిక్‌మనిపించారు. వందలాది పూల గుచ్ఛాలు ఇంటినిండా గుభాళించాయి. స్వయంగా 'N' ఇంటి కొచ్చాడు. కళ్ళు నవ్వుతున్నట్లే ఉన్నాయి. వెనక క్రూరత్వం స్పష్టంగా తెలుస్తుంది. ఇంటినిండా సెక్యూరిటీ. "మోహిని, నువ్వు మా ఆశ. సుందరంలేని కొరత తీర్చాలి. పార్టీలో ప్రముఖస్థానం వహించాలి. మొదటి నుంచి కళాకారులు ప్రేమించిన పార్టీ యిది," అంటూ ఆజ్ఞా పించి వెళ్ళిపోయాడు. ఇంటినిండా సెక్యూరిటీ పేరుతో నాపై నిఘా, మళ్ళీ కార్నివాల్ మొదలైంది. 'N'ని కీర్తిస్తూ నాటకాలు, బాలేలు, ప్రదర్శనలు, నెక్లెస్ రోడ్డు కొత్త సాంస్కృతిక ఉద్యమానికి మెటఫర్ అయ్యింది.

దేహం ఆధారంగా ఒక కొత్త నాట్యభాష సృష్టించబడింది. శరీరాలు ఉప్పొంగటాలు (ఆత్మల మరణం), మార్మిక స్వప్నాలు, క్షణాల్లో భగ్గుమనే ఆనందమూర్ఛనలు, శరీరాల సంగమమొకటే అంతిమ సందేశం. పునరుజ్జీవనమైన కొత్త కళల అంతర్యం యిదే. నా అంతరంగిక ప్రపంచంలోకి 'N' రాజకీయ సన్నిహితుల మొరటు పాదాలు బలిమిన ప్రవేశించటము, నా జీవితంలో అత్యంత విషాద ఘట్టం. ఆత్మల అవసరంలేని శరీర క్రీడ. పార్టీలో ప్రముఖుల ప్రియురాలిగా నాపై ముద్రపడింది. పార్టీ వ్యవహారాలు, నిర్ణయాధికారాలు నాపై పెట్టటం మొదలుపెట్టాడు 'N'. నా చుట్టూ పరివారాలు, పొగడ్తలు, కైవారాలు, సాష్టాంగపడుతున్న అధికార గణాలు. క్రమంగా నేను చచ్చిపోవటం మొదలుపెట్టాను. లోపలంతా ఖాళీ అయిపోయి, ఒట్టి శరీరంగా మిగిలిపోయాను. నగలు, చీరలు, పరిమళ ద్రవ్యాలు, బ్యూటీ పార్లర్లు, దృఢమైన శరీరాల పురుషులు, అన్నీ శరీర పోషణకు అవసరమైనాయి.

అధికారం ఒక ఆటగా, ఆయుధంగా మారి, మీడియోకర్లను మహా కళాకారులుగా సత్కరించాను, కళలేదు. అభ్యుదయంలేదు. అకాడమీ బజారుగా మారింది. వినిమయం, మారకంలేని ఏ కళా యిక్కడ బతకలేదు.

ఎన్ని ప్రదర్శనలు, ఎన్ని నిరసనలు, ఎన్ని ఏడుపులు ప్రదర్శించినా నేను రాజీనామా చేయను. ఉక్కుపాదాలు, అధికారపు బుల్లెట్లు నా దగ్గర ఉన్నాయి. ఇది 'N' మార్కు రాజుల కాలం. ఇక్కడ మృదువైన పరిష్కారాలు ఉండవు. రక్తసిక్తమైన పరిష్కారాలే.

ఇక ముగిస్తాను. ప్రదర్శన మళ్ళీ మొదలుపెట్టండి.

* * *

స్టేజి దిగుతుండగా మళ్ళీ కళ్ళు తిరిగినట్లయింది మోహినికి. అపరిచితమైన లోకంలోకి జారిపోతున్నట్లుగా. ఎవరో ఆమెను వడిసి





పట్టుకొని సీటు దగ్గరకు తీసుకొచ్చారు. 'బ్లాక్ అవుట్, బ్లాక్ అవుట్' అంటూ తనలో తాను గొణుక్కుంది. బయట ఆందోళన చేస్తున్న కళాకారులు ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోయారు. రాత్రి దీర్ఘమైన నిముషాలుగా, మెల్లగా కదులుతుంది. ఇబ్రహీం ఒక్కడే, ఒక జ్ఞాపకం తాలుకు చివరి అడుగులా మిగిలి ఉన్నాడు. ఆకుపచ్చని లాన్ మధ్యలో, పొదవాటి చెట్టును ఆనుకొని, ఫ్లూట్ వాయిస్తూ, అజ్ఞాత గాథలను గుర్తు తెచ్చుకుంటున్నాడు. గాలితెరలపై గాఢంగా, బరువుగా కదులుతుందా పాట.

ఆడిటోరియం విషాద గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుంది. ముద్రలు, భంగిమలు, కన్‌ఫెషన్స్ తరంగాలుగా ఎగిసి వస్తున్నాయి. మోహిని చెవుల్లో చిరపరిచితమైన శబ్దం. ఇబ్రహీం పాట లాంటి పాట. గొప్ప ఆశను కలిగించే పాట.

*ఆదివారం వార్త, 6 నవంబర్ 2005*